తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం
సూర్యాపేట
యాద్రాద్రి భువనగిరి
బుధవారం
10 సెప్టెంబర్ 2025
పేజీలు : 8
Follow :











## మంచి నీటి సంపులో పడి
# ముగ్గురు కార్మికులు మృతి

- మరొకరి పరిస్థితి విషమం
- ఒకరికోసం ఒకరు.. ఇలా నలుగురు దిగారు
- ఆక్సిజన్ అందక ముగ్గురి దుర్మరణం

చర్ల **(జనంసాక్షి):**చర్ల మండలం ఉంజుపల్లి లో మిషన్ భగీరథ మంచినీటి సంపు నిర్మాణ పనుల సందర్భంగా సంపులోకి వెళ్లిన ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందగా.. చికిత్స పొందుతూ మరొక కార్మికుడు మృతి చెందారు. గ్రామంలో రూ .25 లక్షలు విలువతో నిర్మిస్తున్న సంపు నిర్మాణ పనులు సందర్భంగా మంగళవారం సంపు పైన స్లాబు వేస్తున్న క్రమంలో సంపు కిందకు మోటారు వేసేందుకు వెళ్లిన క్రమంలో వుంజుపల్లికి చెందిన కాకా మహేష్ (36), లింగాపురం పాడుకు చెందిన నీలం తులసి రాం( 37) సంపు నీటి లో పడి ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందారు. వీరి కోసం సంపు లోకి వెళ్లిన ఆంధ్రప్రదేశ్లోని తణుకు చెందిన కార్మికుడు ఇషాక్ సైతం భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు వదిలాడు. ఇక్కడ పని చేసేందుకు వచ్చిన ఆంధ్రప్రదేశ్ లోని కాకినాడకు అన్సూరి అప్పలరాజు(కాకినాడ) పరిస్థితి విషమంగా ఉంది. సంఘటన స్థలానికి చేరుకున్న సిఐ రాజు వర్మ, తహసిల్దార్ శ్రీనివాస్ , ఎస్సై నర్సిరెడ్డి ఈ ఘటనపై విచారణ చేస్తున్నారు. మరోపక్క మిషన్ భగీరథ అధికారులు సంఘటన స్థలంలో చేరుకుని విచారణ చేస్తున్నారు. కార్మికుల న్యాయం చేయాలని పలు రాజకీయ పార్టీలు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# పోలీస్ సిబ్బందికి అండగా ఉంటాం

## జిల్లా ఎస్పీ నరసింహ

**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**
విధి నిర్వహణలో గాయాలైన కోదాడ పట్టణ కానిస్టేబుల్ నరేష్ ను మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ నరసింహ పరామర్శించారు.నరేష్ అవసరాల దృష్ట్యా ఆర్థిక సహాయం అందించారు.విధుల నిర్వహణలో ధైర్యంగా ఉండాలని, ఎలాంటి అవాంతరాలు వచ్చిన పోలీసు సిబ్బందికి అండగా ఉంటామని తెలిపారు.పోలీస్ సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీలు రవీందర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, ఏవో మంజు భార్గవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, పోలీస్ సంఘం అధ్యక్షులు రాంచందర్ గౌడ్, ఆర్ఎస్ఐలు అశో క్, సాయిరాం, కానిస్టేబుల్స్ కొండలు, సుధాకర్ పాల్గొన్నారు.


## పీజీ ఎంట్రెన్స్ - సిపిజెట్ ఫలితాల్లో జాగృతి విద్యార్థుల ప్రతిభ విద్యార్థులను అభినందించిన కళాశాల యజమాన్యం

భువనగిరి, సెప్టెంబర్ 9(జనం సాక్షి)
భువనగిరి పట్టణంలోని జాగృతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థులు పీజీ ఎంట్రెన్స్ ఫలితాలలో కే మనీషా (హ.టి నెం.51080280230), ఎం.కామ్ ఫలితాల్లో స్టేట్ 26 ర్యాంక్ నరముల సౌమ్య (హ. టి 62095770177 )ఎం ఎస్సి కెమిస్ట్రీ విభాగంలో 197 ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రిన్సిపల్ సింగనబోయిన మల్లేశం మరియు వైస్ ప్రిన్సిపల్ ఏ మణిపాల్ రెడ్డి ర్యాంకులు సాధించిన విద్యార్థులను శాలువా మరియు మెడల్స్ తో అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం పాల్గొని విద్యార్థులకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

## సేవాలాల్ సేన నల్లగొండ జిల్లా నూతన కన్వీనర్ గా అశోక్ నాయక్ ఎన్నిక



**హాలియా, సెప్టెంబర్ 8 జనం సాక్షి :** హైదరాబాదు లోని సేవాలాల్ సేన రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు ఆంగోతు రాంబాబురావు నాయక్ ఆధ్వర్యంలో సేవాలాల్ సేన నల్లగొండ జిల్లా నూతన కన్వీనర్ గా అనుముల మండలం వీర్లగడ్డ తండ గ్రామానికి చెందిన నేనావత్ అశోక్ నాయక్ ను ఏకిగ్రీవంగా ఎన్నుకొని నియామక పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా అశోక్ నాయక్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు కావస్తున్నా నేటికీ జిల్లాలో వేలాది మంది గిరిజనులకు కనీసం కూడు, గూడు,నీడ లేక పరితపిస్తున్నారని తెలిపారు. అలాగే గిరిజనుల సమస్యల కోసం సేవాలాల్ సేన నిరంతరం పోరాడుతుందన్నారు. అనంతరం నాపై నమ్మకం ఉంచి ఇచ్చిన ఈ పదవిని తూ.చ తప్పకుండా నెరవేరుస్తానని సేవాలాల్ సేన రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలిపారు.





## పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యే కు అందజేసిన సిపిఎం పార్టీ

**బూర్గంపహాడ్ సెప్టెంబర్ 09 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :-మండల పర్యటనలో ఉన్న పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు కు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మంగళవారం అందజేశారు. బూర్గంపహాడ్ మండలం సారపాక మసీదు రోడ్డు నుండి తాళ్ల గుమ్మూరు వెళ్లే రోడ్లు గుంతల మైమైందని, చెరువు సింగారం ఫారెస్ట్ అధికారులు పట్టా భూమిలో పత్తి పీకినందుకు బాధితులకు న్యాయం జరగాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇందుకు వెంటనే స్పందించిన ఎమ్మెల్యే గ్యాస్ గోడం దగ్గర నుండి తాళ్లగుమ్మురు ముత్యాలమ్మ పేట వరకు మూడు కోట్లు కేటాయించడం జరిగిందని, అదేవిధంగా పత్తి పీకిన ఫారెస్ట్ అధికారులతో మాట్లాడి న్యాయం జరిగే విధంగా చేస్తామని హామీ ఇచ్చారు. గుంతలు పడిన రోడ్లకు తాత్కాలికమైన మరమ్మతులు చేయాలని సిపిఎం పార్టీ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు ఎమ్మెల్యేను కోరగా వెంటనే గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేష్ ని పిలిచి రోడ్డుకి తాత్కాలికమైన మరమ్మతులు చేయమని ఆదేశాలిచ్చారు. వర్షాకాలం వెళ్లిన వెంటనే ఈ రోడ్లు నిర్మాణాన్ని చేపడతామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు పాపినేని సరోజన, అబిదా, కనకం వెంకటేశ్వర్లు, బత్తుల గోపాల రావు, సర్ప సత్యనారాయణ, సర్ప ముత్తయ్య, సున్నం లక్ష్మయ్య, తాటి కాసులమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటనను విజయవంతం చేయండి

**కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రాయబారపు కవిరాజ్ పిలుపు**



**కామేపల్లి,సెప్టెంబర్ 9 (జనం సాక్షి):**

ఈనెల 10న ఖమ్మం జిల్లా పర్యటన కై తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగరి ప్రీతం. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ కు విచ్చేస్తు న్నారు. కావున జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మాజీ సర్పంచులు. వార్డ్ నెంబర్లు ఈ పర్యటనను ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,అభిమానులు ప్రజా ప్రతినిధులు మాజీ ప్రతినిధులు మహిళలు పార్టీ అనుబంధ సంఘ నాయకులు మేధావులు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కామేపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాయబారపు కవిరాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## సంతలో వ్యాపారం సజావుగా సాగాలి



కోదాడ, సెప్టెంబర్ 09:( జనం సాక్షి):

శని, మరియు ఆదివారం జరిగే కోదాడ సంతలో వ్యాపారస్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్ సంబంధిత అధికారులకు సిబ్బందికి సూచించారు. సోమవారం యాడ్ క్లీనింగ్ పశువులకు తాగునీరుతో పాటు వ్యాపారస్తులకు కొనుగోలు అమ్మకాలు సజావుగా జరిగే విధంగా చూడాలన్నారు. కొంతమంది వ్యక్తులు రాత్రి వేళలో సంతలోకి గోడ పై నుండి పందులను వదిలిపెడుతున్నారని అది మంచి పద్ధతి కాదన్నారు. వ్యాపారస్తులు నేరుగా సంతలోనే వ్యాపారాలు చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరు సంత అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కొంతమంది వ్యాపారస్తులు సంతకు వచ్చే పశువుల వాహనాలను అక్కడక్కడ నేషనల్ హైవే పైన మార్గ మధ్యలో కొనుగోలు చేసి సంత కు ఆదాయం రాకుండా చేస్తున్నారన్నారు. పశువులను అడిగిన రేటుకు ఇవ్వలేదని లేదా వారికి అమ్మలేదని కావాలనే కొంతమంది సంతలో కొనుగోలు చేసుకుని రసీదులు తీసుకొని సుదూర ప్రాంతాలకు చుట్టుపక్కల గ్రామాలకు వెళ్తున్న పశువుల వాహనాలను బజరంగ్దళ్ సంబంధించిన వ్యక్తులకు పోలీసులకు సమాచారమిచ్చి వాహనాలు పట్టిస్తున్నారాని లక్షల రూపాయలు పెట్టి ఎక్కడెక్కడో సుదూర ప్రాంతాల నుంచి అమ్మకాలు కొనుగోలు చేస్తున్న వ్యాపారస్తుల జీవనోపాధి మీద దెబ్బతీస్తున్నారు అన్నారు. వ్యాపారస్తుల సమస్యలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మా రెడ్డి దృష్టికి తీసుకు వెళు న్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి సలహాలు సూచనలు సహకారంతో సంత అభివృద్ధికి పాలకవర్గం అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు.

## ఘనంగా కాళోజి నారాయణరావు జయంతి వేడుకలు



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**

పుట్టుక నీది, చావు నీది, బ్రతుకంత దేశానిది అని ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో తన కవిత్వంతో కాళోజి నారాయణరావు ప్రజలను మమేకం చేశారని జిల్లా పరిషత్ సీఈఓ వివి.అప్పారావు అన్నారు.మంగళవారం కలెక్టరేట్ లో కాళోజి నారాయణ రావు 111వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళోజి జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. కాళోజి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని సాంస్కృతిక పరంగా, భాషాపరంగా కాళోజీ పాత్ర ఎంతో ఉందన్నారు. నిజాం వ్యతిరేక ఉద్యమంలో, యూనివర్సిటీ విద్యార్థులకు అనుకూలంగా అనేక పోరాటాలు చేశారని, స్వాతంత్ర ఉద్యమంలో సైతం కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. బూర్గుల రామకృష్ణారావు, జమలాపురం కేశవరావు, పీవీ నరసింహారావు వంటి నాయకులతో అనేక ఉద్యమాలు చేశారని, వారి ఆశయాలను నేరవెర్చేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి టి.నరసింహులు, డిపిఓ యాదగిరి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి శంకర్ నాయక్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి దయానంద రాణి, కలెక్టరేట్ పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి దున్న శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



**జిల్లా పోలీస్ కార్యాలయంలో...**

ప్రజా కవి కాళోజి నారాయణరావు జయంతి వేడుకలను జిల్లా పోలీసు కార్యాలయం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నరసింహ కాళోజి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కాళోజీ నారాయణరావు తన కవితలతో ప్రజలను ప్రభావితం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, వెల్ఫేర్ ఆర్ఎస్ఐ సాయికుమార్, అడ్మిన్ ఆర్ఎస్ఐ అశోక్, సిసిఎస్ సిబ్బంది, ఏఆర్ ఎస్ఐ పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బొడ్డుపల్లి కళాచారి**




**కొండమల్లేపల్లి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):**

పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జార్జిరెడ్డి పిడిఎస్యు తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 15న హైదరాబాద్ లో జరిగే బిగ్ డిబేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ జార్జి రెడ్డి పి.డి.ఎస్. యూ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు బొడ్డుపల్లి కళాచారి అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ క్రాంతి జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన రాష్ట్ర సహాయ కార్యదర్శి అంజితో కలిసి మాట్లాడుతూ రాష్ట్రంలో గత మూడున్నరేళ్లుగా విద్యార్థులకు అందించే ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు సుమారు 8000 కోట్ల రూపాయలు పెండింగ్ ఉన్నాయని అన్నారు. అందువలన విద్యార్థులు ఉన్నత విద్యకు తీవ్ర ఆటంకాలు ఎదుర్కొంటున్నారని అన్నారు. గత ఏడాది కాలంగా విద్యార్థులు, తల్లితండ్రులు తీవ్ర ఆందోళన పడుతున్నారని అన్నారు. దేశ విద్యా అభివృద్ధికి దారులు వేసే విద్యార్థులకు, విద్యా రంగానికి నిధులు విడుదల చేయడంలో నిర్లక్ష్యం వివక్ష తగదన్నారు. విద్యార్థి సంఘాలు దశల వారీగా ఈ సమస్య పరిష్కారానికి పోరాడుతున్నామని తెలిపారు. ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెంచి నిధులు విడుదల చేసేలా కృషి చేయడానికి జార్జి రెడ్డి పి.డి.ఎస్.యూ రాష్ట్ర కమిటీ బిగ్ డిబేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేధావులు, విద్యా వేత్తలు విద్యార్థి, మహిళా ప్రజా సంఘాల నేతలు వివిధ రాజకీయ పార్టీల నేతలు హాజరవుతారని తెలిపారు. ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను ప్రభుత్వం విడుదల కొరకు విద్యార్థులు పోరుబాటలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీలకు న్యాయం జరగాలని గ్రామ దేవతలకు మొక్కులు



**టేకులపల్లి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం కొప్పురాయి గ్రామంలో 9వ తారీకున సుప్రీంకోర్టులో లంబాడీలను ఎస్టీ జాబితాల నుండి తొలగించాలని సుప్రీంకోర్టులో వచ్చే తీర్పు ఆదివాసులకు న్యాయం జరగాలని మంగళవారం గ్రామదేవతలకు బొడ్రాయికు పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించిన ఆదివాసి గిరిజనులు. వీసాల రవి దొర ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తుడుం దెబ్బ జాతీయ కో-కన్వీనర్ కల్తి సత్యనారాయణ,జార మంగయ్య,జార నారాయణ, గొగ్గేల కళ్యాణ్ కుమార్, ఒడ్డుగూడెం గ్రామం నుండి చింత వెంకన్న,పెనాక రామస్వామి, పెనకా సత్యం,మోదుగుల గ్రామం నుండి పాయం వసంత రావు, కల్తి శ్రీను,కుంజా సమ్మయ్య, పుణెం గోపాల్, లక్ష్మీపురం గ్రామం నుండి కల్తీ భాస్కర్ రావు, బర్లగూడెం నుండి పుణెమ్ అనేష్, మద్దెల రవి, ఇప్పల చెలక నుండి మెట్ల ప్రసాదు,పూనమ్ భాస్కర్, పడిగ రమేష్, మహిళలు ఏప సాయమ్మా, జార నారాయణమ్మ,జార రోజా తదితరులు పాల్గొన్నారు.



## దేవరకొండ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్

**దేవరకొండ, సెప్టెంబర్ 07(జనంసాక్షి)**
రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల కార్యాచరణలో భాగంగా మంగళవారం మెప్మా-పురపాలక సంఘం ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలోని మినీ బస్టాండ్ వద్ద స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. మొత్తం 7 స్టాల్స్‌లో 4 రకాల ఫుడ్ ఐటమ్స్‌ను ఏర్పాటు చేయగా మున్సిపల్ కమిషనర్ సుదర్శన్ స్టాల్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెప్మా ద్వారా ఉపాధి పొందిన మహిళలు ఆర్థిక పురోగతి సాధించేలా కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్ బ్యాగులను పరిశీలించి బట్ట సంచులను ఉపయోగించాలని కోరారు. 8500 రూపాయల వరకు ఫుడ్ మరియు ఎస్ హెచ్ జి ప్రొడక్ట్స్ విక్రయాలు జరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏ ఈ రాజు, సానిటరీ ఇన్స్పెక్టర్ సురిగి శంకర్ గౌడ్, మున్సిపల్ మేనేజర్ రాకేష్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ సక్రు నాయక్, మెప్మా టీఎంసీ జగమంత్, మెప్మా ఆర్పీలు, వార్డు అధికారలు సిబ్బంది, సుమారు 320 మంది మహిళా సంఘం సభ్యులు, వీధి విక్రయదారులు పాల్గొన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఆత్మకూరు(ఎస్) మండల వ్యవసాయ అధికారి దివ్య సస్పెన్షన్

**ఆత్మకూరు(ఎస్) (జనం సాక్షి):**
క్షేత్రస్థాయిలో యూరియా సరఫరా లో సరైన పర్యవేక్షణ చేయనందుకుగాను సూర్యపేట జిల్లా, ఆత్మకూరు(ఎస్) మండల వ్యవసాయ అధికారి దివ్యను విధుల నుండి సస్పెన్షన్ చేసినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆత్మకూరు మండలం నెమ్మికల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు యూరియా సరఫరా చేయడం జరిగింది. అయితే ఆన్లైన్ అమ్మకాలకు, భౌతిక అమ్మకాలకు తేడాలు వచ్చాయి. ఈ విషయం రైతులతో అయోమయానికి ,గందరగోళానికి దారి తీసింది. దీనివల్ల రైతులకు తప్పుడు సమాచారం వెళ్లాడాన్ని గమనించిన జిల్లా కలెక్టర్ యూరియా సరఫరాను సక్రమంగా పర్యవేక్షణ చేయకుండా విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించినందుకుగాను ఆత్మకూరు మండల వ్యవసాయ అధికారి దివ్య ను విధుల నుండి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. యూరియా పంపిణీలో నిర్లక్ష్యం వహించిన, అక్రమాలకు పాల్పడిన సహించేది లేదని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

# గ్రంథాలయ పుస్తక పఠన నైపుణ్యం అలవరచుకోవాలి

### ఏనుబాముల ఉన్నత పాఠశాలకు పుస్తకాల బహుకరణ




**ఆత్మకూరు (ఎస్) జనంసాక్షి:**
మండల విద్యాధికారి పాతులోత్ ధారాసింగ్. మండల పరిధిలోని ఏనుబాముల ఉన్నత పాఠశాలకు సూర్యాపేటలోని పిల్లలమర్రి పిన వీరభద్ర కళాపీఠం వ్యవస్థాపకులు,కవి, రచయిత, తెలుగు భాషోపాధ్యాయులు శీల అవిలేను 60 పుస్తకాలను బహుమానంగా అందించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు మండల విద్యాధికారి పాతులోత్ ధారాసింగ్ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే విద్యార్థిని, విద్యార్థులు పాఠశాలలోని,గ్రామాల్లోని గ్రంథాలయాలలోని పుస్తకాలను చదివి జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియలను విద్యార్థులు తెలుసుకొని భవిష్యత్తులో తెలుగు సాహిత్య రంగంలో కవులు, రచయితలుగా ఎదగాలని ఆకాంక్షించారు. పుస్తకాలు అందజేసిన శీల అవిలేను కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఫోన్,సోషల్ మీడియాకు దూరంగా విద్యార్థులు ఉండేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అన్నారు. అనంతరం ఈ పాఠశాలలో గత నెల 29వ తారీఖున తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రతిభా పరీక్షలో గెలుపొందిన విద్యార్థులు ధారవత్ పవన్,బాణోత్ బిందు,గంపల హర్షవర్ధన్, వల్లమల్ల భార్గవిలకు ప్రశంసా పత్రాలు, పుస్తకాలను బహుమానంగా అందించారు. తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా, గ్రంథాలయ పుస్తకాలను పాఠశాలకు తీసుకురావడంలో కృషిచేసిన తెలుగు ఉపాధ్యాయుడు దేవరాజుని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భరణీ కుమార్, శ్రీనివాస్, ఝాన్సీ, మహాలక్ష్మీ, వెంకన్న, నాగరాజు, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మార్క్సిస్ట్ మహోపాధ్యాయుడు మావోకు విప్లవ జోహార్లు

### సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో వర్ధంతి సభ

**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 9 (జనం సాక్షి):**
మార్క్సిస్ట్ మహోపాధ్యాయుడు, చైనా విప్లవ సారథి కామ్రేడ్ మావో జెడాంగ్ 49వ వర్ధంతి సందర్భంగా భూదాన్ పోచంపల్లి మండలం దంతూరు గ్రామంలో ఘనంగా నివాళులు అర్పించారు. మావో చిత్రపటానికి పూలమాల వేసి, రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ సందర్భంగా పోచంపల్లి పట్టణ నాయకులు పగడాల శివ మాట్లాడుతూ.. చైనాలో నూతన ప్రజాస్వామిక పంథాలో విప్లవాన్ని సాధించిన మావో బాటలో భారతదేశంలో సమసమాజ స్థాపన కోసం ముందుకు సాగాలి అని పిలుపునిచ్చారు. మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ సిద్ధాంతాలను అనుసరించి మావో వెనుకబడిన దేశంలో విప్లవాన్ని నడిపారని ఆయన గుర్తుచేశారు. లాంగ్ మార్చ్ ద్వారా కఠిన పోరాటం సాగించి 1949లో విప్లవాన్ని




సాధించిన మావో ఆలోచనా విధానం నేటికీ మార్గదర్శకమని వివరించారు. అలాగే, చైనాపై నిందలు మోపిన బీజేపీ మోడీ ప్రభుత్వం ఇప్పుడు ఆ దేశంతో స్నేహం కోసం పాకులాడుతోందని, అమెరికా నియంతృత్వ పోకడలకు మోడీ వశపడటం దేశానికి ప్రమాదకరం అని వ్యాఖ్యానించారు. ప్రజలపై, కార్మిక వర్గం, రైతులపై మోడీ ప్రభుత్వం చేస్తున్న దాడులపై పోరాడాలని, ఫాసిస్టు ధోరణులను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోతగల నరసింహ, గోరుగంటి ముత్యాలు, పాక లింగస్వామి, పగడాల సతీష్, పందుల సత్తయ్య, ఉడతలు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# పద్మవిభూషణ్ కాళోజి సేవలు చిరస్మరణీయం

### పంచాయతీ సెక్రటరీ డాకు నాయక్

**కొండమల్లేపల్లి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):**
పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు తెలంగాణ సాహిత్యానికి సాహితీ సమరానికి నిలువెత్తు నిదర్శనమని తెలంగాణ యాసకు భాషకు జీవంపోసి ప్రజా ఉద్యమాలకు ఊపిరిలూదిన మహనీయుడు కాళోజీ నారాయణరావు అని కొండమల్లేపల్లి మేజర్ గ్రామ పంచాయతీ సెక్రటరీ డాకు నాయక్ అన్నారు. మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో కాళోజి నారాయణరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాళోజి నారాయణరావు స్వాతంత్ర్య సమరయోధుడిగా, సామాజిక ఉద్యమకారునిగా, కవిగా తెలంగాణ సమాజానికి కాళోజీ చేసిన సేవలు ఎంతో గొప్పవని కాళోజి సేవలను కొనియాడారు. అన్యాయం ఎక్కడ జరిగినా కాళోజీ గళమెత్తేవారని, అసమానతలు, దోపిడీ, నిరాదరణకు గురవుతున్న వారిలో ఆయన కలం చైతన్యాన్ని నింపిందని గుర్తు చేశారు. స్థానిక భాషకు ప్రాధాన్యతనిచ్చి ఎవరి వాడుక భాషను వారు



రాయాలని ఇతరుల భాషను అనుకరించే బానిస భావన పోవాలని ఆయన తపించిన తీరుతో ప్రతి ఒక్కరిలో ఆత్మగౌరవం వెల్లుబికుతుందని అన్నారు. తెలంగాణ భాషకు, యాసకు, సాహిత్యానికి చేసిన కృషికి గుర్తుగా కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని వివరించారు. అంతటి మహనీయుడు తెలంగాణ గడ్డపై పుట్టడం మనందరికి గర్వకారణమని కొనియాడారు. ప్రజల గొంతుకగా జీవితాంతం బతికిన కాళోజీ చిరస్మరణీయులని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాళోజిలో ఉన్న ప్రశ్నించే తత్వాన్ని, ధైర్యాన్ని ప్రతీఒక్కరూ అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. వారివెంట ఫిట్టర్ అండ్ బిల్ కలెక్టర్ రాంరెడ్డి, బిల్ కలెక్టర్ ప్రవీణ్, రికార్డ్ అసిస్టెంట్ లక్ష్మణ్, పంపు ఆపరేటర్ అంజి, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## నేడు హుజూర్ నగర్ మండల కమిటీ ఎన్నిక

- స్థానిక ఎన్నికలలో విజయం దిశగా కృషి
- హుజూర్ నగర్ యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు కుక్కడపు మహేష్ గౌడ్



**హుజూర్ నగర్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):**
రాష్ట్ర సివిల్ సప్లయ్, నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు హుజూర్ నగర్ న్యోఈజకవర్గంలోని అన్ని మండలాల యూత్ కాంగ్రెస్ కమిటీల నియామక నిర్వహణ జరుగుతుందని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుక్కడపు మహేష్ గౌడ్ తెలిపారు. మంగళవారం ఈ సందర్భంగా మహేష్ గౌడ్ మాట్లాడుతూ బుధవారం హుజూర్ నగర్ మండల కమిటీ ఎన్నికను పూర్తిచేసి, ఆ తర్వాత వరుసగా మిగిలిన మండలాల కమిటీల ఎన్నికను పూర్తి చేస్తామన్నారు. రాజకీయాల్లోకి యువతను తీసుకువచ్చి పార్టీని మరింతగా బలపరిచి స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జయకేతనం ఎగురవేసే విధంగా అందరూ కష్టపడాలన్నారు. కష్టపడే యువతకు కమిటీలలో తప్పక అవకాశాలు ఉంటాయన్నారు.



## ముష్టికుంట్ల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పరిశీలన

**బోనకల్, సెప్టెంబర్ 09 (జనం సాక్షి):**
బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామంలోని ఆయుష్మన్ ఆరోగ్య మందిర్ (సబ్ సెంటర్) ను మంగళవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి.కళావతి బాయి , డిపిఓ ఎం దుర్గ ఆకస్మికంగా సందర్శించారు. జనరల్ విసిట్ లో భాగంగా ఉపకేంద్రం సందర్శించారు. వర్షం కారణం గా దెబ్బతిన్న ముష్టికుంట్ల ఉప కేంద్రం ను సందర్శించి చుట్టూ ఉన్న పరిసరాలు తనిఖీ చేశారు. నెల క్రితం వర్షం వల్ల ఉప కేంద్రం లోకి వర్షం నీరు చేరటం దాని ద్వారా ఉప కేంద్రం లోనికి వెళ్ళటం కష్టం గా ఉన్నది. ఉప కేంద్రం లో ఉన్న ఫర్నిచర్ నీటి లో ఉండిపోయాయి. ఇంకా ఆ నీరు నిల్వ అక్కడక్కడ ఉండటం చూసి పంచాయతీ సెక్రటరీ ని వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఉప కేంద్రం చుట్టూ ఉన్న పరిసరాలు పరిస్థితి ను కూడా చూశారు. ఈ విషయం ను పై అధికారుల దృష్టి కి తీసుకెళ్తా అని చెప్పటం జరిగింది. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్రవంతి, సిహెచ్ఓ దానయ్య, పల్లేదవాఖన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక, గ్రామ సెక్రటరీ సైదులు,ఏఎన్ఎంలు ఫాతిమా, శివరాణి, ఆశ కార్యకర్తలు , అంగన్వాడీలు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు ఉచిత కంటి వైద్య శిబిరం


**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి) :**
జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో నేడు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం సూర్యాపేట మండల అధ్యక్ష , కార్యదర్శులు దండ శ్యాంసుందర్ రెడ్డి, సుదగాని నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.శ్రీ కంటి హాస్పిటల్, సూర్యాపేట వారి సౌజన్యంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.ఈ వైద్య శిబిరంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. పెన్షనర్లు, ఆరోగ్యశ్రీ కార్డు కలిగిన వారు, రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## జై గౌడ్ హుజూర్ నగర్ పట్టణ అధ్యక్షుడిగా వల్లపుదాసు నాగరాజు గౌడ్ నియామకం

**హుజూర్ నగర్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):**
జై గౌడ్ ఉద్యమ జాతీయ అధ్యక్షులు వట్టికూటి రామారావు గౌడ్ ఆదేశాల మేరకు హుజూర్ నగర్ లో శ్రీశ్రీశ్రీ కంఠమహేశ్వర స్వామి సురమాంబ తల్లి గుడిలో సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షులు కేశగాని నాగేశ్వరరావు గౌడ్ ఆధ్వర్యంలో సోమగాని నరసింహ గౌడ్ అధ్యక్షతన నూతన జై గౌడ్ ఆ కమిటీని మంగళవారం నిర్ణయించారు. జై గౌడ్ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొండ హరీష్ గౌడ్, హుజూర్ నగర్ జై గౌడ్ పట్టణ అధ్యక్షులు వల్లదాసు నాగరాజు గౌడ్, జై గౌడ్ పట్టణ ప్రధాన కార్యదర్శి సోమగాని మహేష్ గౌడ్ లను నియమించారు. ఈ సందర్భంగా హుజూర్ నగర్ జై గౌడ్ పట్టణ అధ్యక్షులు వల్లదాసు నాగరాజు గౌడ్ మాట్లాడుతూ నూతన జై గౌడ్ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. జై గౌడ్ సంఘానికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. జై గౌడ్ కమిటీని నియమించినందుకు సంఘానికి కృతజ్ఞతలు తెలిపారు.



## కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వెంటనే ప్రారంభించాలని కోరుతూ సబ్ కలెక్టర్కు వినతిపత్రం అందజేత



**కల్లూరు సెప్టెంబర్ 09(జనం సాక్షి)**
రెవిన్యూ డివిజన్ కేంద్రం కల్లూరు లో మండల ప్రజల ఆరోగ్య సంరక్షణ నిమిత్తం నూతనంగా నిర్మించిన ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను వెంటనే ప్రారంభించి పూర్తి స్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరుతూ సీపీయమ్ పార్టీ డివిజన్ కమిటీ సభ్యులు తన్నీరు క్రిష్ణార్జునరావు ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ కు మంగళవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన అనంతరం ప్రస్తుత వర్షాకాలంలో గ్రామాల్లో మండల కేంద్రంలో విషజ్వరాలు ప్రభావం అధికంగా ఉందని ప్రజలు , టైఫాయిడ్, వైరల్ ఫీవర్ , జలుబు, దగ్గు, శారీరక నొప్పుల తోటి తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రస్తుతం పాత హాస్పిటల్ లో సరైన వసతులు వివిధ రకాల అనారోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చేరిన రోగులు ఒక్కోమంచంమీద ఇద్దరు , ముగ్గురు పేషెంట్లు, తీవ్రమైన అవస్థలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.,సరైన వైద్య సదుపాయాలు ,పూర్తి స్థాయిలో వైద్యులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు ఆవేదన వ్యక్తం చేశారు. శిథిలావస్థలో చేరిన ఆసుపత్రి భవనంలో వైద్య సేవలు నిర్వహిస్తుండటంతో వర్షాకాలంలో ఆసుపత్రి భవనం స్లాబు పెచ్చులు ఉడి పడటం వర్షపు నీరు ఆస్పత్రి ఆవరణలో నిల్వ ఉండటం రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారా అన్నారు. పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగిప్రారంభానికి సిద్ధంగా ఉన్నా నూతనఆసుపత్రి భవనంనువెంటనే ప్రారంభించి పూర్తి స్థాయిలో రోగులకు వైద్య సేవలు అందించాలని,అన్నిరకాల వైద్య సిబ్బందిని నియమించాలని కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ కి వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు..ఈకార్య క్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యుడు బట్టు నరసింహారావు, నాయకులు నాయుడు రవికొండలరావు తదితరులు పాల్గొన్నారు.

### స్టెమ్‌స్పార్క్‌రెజొనెన్స్ శ్రీనగర్‌లో

## "తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు"



**ఖమ్మం, (జనం సాక్షి):**
స్థానిక శ్రీనగర్ కాలనీలోని రెజొనెన్స్ స్కూల్లో ప్రజా కవి, ప్రజాసామ్యవాది, మానవతావాది, పద్మవిభూషణ్ కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకొని కాళోజిగారి చిత్రపటాన్ని పూలమాలతో అలంకరించి తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు మాట్లాడుతూ, కాళోజిగ తెలంగాణ ప్రాంత విలువైన సాహిత్యపు ఆస్తి అని పుట్టుక నీది చావు నీది బ్రతుకంతా దేశానిదే అన్న కవి అంటూ అన్యాయాన్ని ఎదిరిస్తే నా గోడవకు సంతృప్తి, అన్యాయం అంతరిస్తే నా గోడవకు ముక్తి ప్రాప్తి, అన్యాయాన్ని ఎదిరించినోడే నాకు ఆరాధ్యుడని సూటిగా చెప్పిన మానవతావాది కాళోజిగారు అంటూ నిజాం నిరంకుశ పాలనలో అణిచివేయబడిన తెలంగాణ యాస, భాషలు నేడు పాఠ్యపుస్తకాలలో పాఠ్యంశాలుగా పొందుపరచి మన యాస, భాషలకు అద్భుతమైన గౌరవం తెచ్చుకున్నామని మన ప్రాంత మాండలికాలను, యాసను బావితరా లకు అందించాలని తెలియజేస్తూ అందరికి తెలంగాణ భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరక్టర్ కొండా కృష్ణవేణి పాల్గొని మాట్లాడు తూ కాళోజి నారాయణరావు గారు తన జీవితకాలం ఎక్కడ అన్యాయం ఉన్నా, అణచి వేయబడుతున్న తాడిత, పీడిత ప్రజల పక్షాన నిలబడి సమాజంలోని సమకాలిన అంశాలను తన కవితలుగా తెలంగాణ యాస, భాషలలో చూపిస్తూ తెలంగాణ భాషా సౌందర్యాన్ని అందరికి అర్ధమైయ్యేలాగా సామాజిక చైతన్యాన్ని కలిగించిన ఉద్యమకవి అంటూ వారి సాహిత్య సేవను, పోరాటజీవితాన్ని, ప్రజాహితాన్ని తెలియజేస్తూ అందరికి తెలంగాణ భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసారు. తెలంగాణ భాషా దినోత్సవ సందర్భంగా స్కూల్లో విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలను నిర్వహించి వాటిలో విజేతలుగా నిలిచిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులను అందజేసి వారిలో తెలంగాణ భాష పట్ల, తెలంగాణ కవుల పట్ల గౌరవాన్ని, ఆసక్తిని పెంపొందింపజేస్తూ వారిలో ఉత్సహాన్ని నింపుతూ అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.వి.ఆర్. మురళీమోహన్, ఉపాధ్యాయులు మరియు ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గోన్నారు.



## కేతన్ నాయక్ ను పరామర్శిస్తున్న మాజీ మంత్రివర్యులు సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు

**హాలియా సెప్టెంబర్ 9 జనంసాక్షి**
తెలంగాణ రాష్ట్ర ట్రై కార్ మాజీ చైర్మన్ AIBSS తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఇస్లావత్ రాంచందర్ నాయక్ గారి కుమారుడు కేతన్ గారికి ప్రమాదవశాత్తు యాక్సిడెంట్ జరిగింది. విషయం తెలుసుకొని హైదరాబాద్ పంజాగుట్ట నిమ్స్ హాస్పటల్లో చికిత్స పొందుతున్న కేతన్ నాయక్ పరామర్శిస్తున్న లిమాజీ మంత్రివర్యులు, సిద్ధిపేట శాసనసభ్యులు శ్రీ తన్నీరు హరీష్ రావు,మరియు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర వారితోపాటు ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ , మాజీ కార్పొరేషన్ చైర్మన్లు దేవి శ్రీ ప్రసాద్ , పల్లె రవికుమార్ గౌడ్ , AIBSS తెలంగాణ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ మోహన్ సింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయాలు సాధిస్తాం

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రేపాకుల శ్రీనివాస్
- లచ్చగూడెం గ్రామంలో ఘనంగా ప్రథమ వర్ధంతి సభ



**టేకులపల్లి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి) :**
సిపిఎం మాజీ జాతీయ కార్యదర్శి అమరజీవి కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయాల సాధనకు ఉద్యమిద్దామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రేపాకుల శ్రీనివాస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం లచ్చగూడెం గ్రామంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ ఈసం నర్సింహారావు అద్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ గ్రామాన ఏచూరి వర్ధంతి సభలు జరుపుతున్నామన్నారు. భారతదేశంలో కష్టజీవుల రాజ్యం రావాలని పోరాడిన గొప్ప పోరాట యోధుడని కొనియాడారు. పార్లమెంటులో అత్యుత్తమ పార్లమెంటేరియన్ గా పేరుపొందిన ప్రజా నాయకుడని అన్నారు. గొప్ప మార్క్సిస్టు మేధావిని దేశం కోల్పోయిందన్నారు, బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో పేదరికం, నిరుద్యోగం తీవ్రంగా పెరిగిందన్నారు. ప్రజలపై ధరలు పెంచి భారాలు మోపుతుందన్నారు. ప్రజలందరినీ పోరాటాల వైపు నడిపించడమే ఏచూరికిచ్చే ఘన నివాళి అన్నారు. ఈ కార్యక్రమం లో సిపిఎం మండల కార్యదర్శి ఈసంనర్సింహారావు, మండల కమిటీ సభ్యులు కదుదుల వీరన్న,పూనెం స్వామి,చంద్రశేఖర్,దొడ్డ సంపత్ కుమార్,దొడ్డ సావిత్రి, కోటేశ్వరరావు,కుంజ రమేష్, భారతమ్మ, చుక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.



# కామ్రేడ్ మావోకు విప్లవ జోహార్లు!

**కోదాడ, సెప్టెంబర్ 9 (జనం సాక్షి):** స్థానిక లాల్ బంగ్లాలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కామ్రేడ్ మావో48వ, వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించడం జరిగింది.అనంతరం అరుణోదయ జిల్లా అధ్యక్షులు ఉదయగిరి పాల్గొని మాట్లాడుతూ చైనా విప్లవోద్యమ రథసారథి మార్క్సిజాన్ని వెనకబడిన దేశమైన చైనాకు అన్వయింపు చేసుకొని చైనాలో విప్లవోద్యమాన్ని విజయవంతం చేసిన మహా నాయకుడు, కమ్యూనిస్టు మహోపాధ్యాయు లలో ఒకరు పీడిత దేశాల లో జరిగే విప్లవోద్యమాలకు విప్లవకారులకు ఆదర్శప్రాయుడు కామ్రేడ్ మావో అని అన్నారు. కమ్యూనిజాన్ని విస్తరింప చేయడంలో మావో పాత్ర కీలకమైనదని, భారతదేశ విప్లవోద్యమ విజయవంతకై మార్క్సిజం లెనినిజం మావో ఆలోచన విధానం భారత దేశ విముక్తికి వెలుగు దారిఅని అన్నారు, మావో చూపిన దీర్ఘకాలిక సాయుధ ప్రజాయుద్ధ పంథాయే మనలాంటి వెనుకబడిన దేశాల విప్లవోద్యమాలకు దిక్సూచి అని తెలిపారు. కామ్రేడ్ మావోకు ఘనంగా విప్లవ జేజేలు పలికారు.ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు జిల్లా సహాయ కార్యదర్శి వి నరసింహారావు, విజయ్, వీరబాబు, నాగేష్, సలీం, రవితేజ, ఖాసిం, నరసింహరావ్,చోటు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ అధికారులు వీరే

**కనగల్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి)**

గ్రామాలలో రెవెన్యూ వ్యవస్థను పటిష్టపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాత్మకంగా చేపట్టిన ప్రక్రియలో భాగంగా మండలానికి 9 మంది గ్రామ పంచాయతీ అధికారులను (%+గ్రా.గా%) కేటాయించి, రెవెన్యూ క్లస్టర్ల వారి గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వడ్డీపల్లి వెంకటరమణ పగిడిమర్రి క్లస్టర్ (పగిడిమర్రి, దోరేపల్లి, షాప్దిలాపురం), బూరుగు వెంకటేశం చిన్న మాదారం క్లస్టర్(చిన్న మాదారం, ఇరుగంటిపల్లి, మంగేనే పల్లి, నరసింహపురం,) గుండెబోయిన కల్పన తురకపల్లి క్లస్టర్(తురకపల్లి, హైదాలాపురం, ఎం గౌరారం) ,పోలే రామస్వామి (కనగల్లు, క్లస్టర్ ),పావన గుండ్ల హరికృష్ణ గౌడ్ చెట్ల చెన్నారం క్లస్టర్(చెట్ల చెన్నారం, శేరి లింగోటం, మైలాపురం, బొమ్మేపల్లి), నాగటి ప్రసాద్ జి ఎడవల్లి క్లస్టర్(జి ఎడవల్లి, బుడమర్లపల్లి, బోయనపల్లి),బి పర్వతాలు (పొనుగోడు క్లస్టర్), గొండి వెంకట్ రెడ్డి ధర్వేశిపురం క్లస్టర్ (ధర్వేశిపురం, చర్ల గౌరారం, పర్వతగిరి) అద్దంకి కుమార్,( రేగట్టే క్లస్టర్) వీరికి కేటాయించిన క్లస్టర్లు లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టేందుకు తాసిల్దార్ కార్యాలయంలో తమ నియామక ఉత్తర్వులను అందజేసినట్లు రెవెన్యూ ఉన్నతాధికారులు తెలిపారు.




## బంగారు పతకం గెలిచిన మాంటిస్సోరి పాఠశాల విద్యార్థికి అభినందనలు తెలిపిన ప్రిన్సిపల్ బి వి సునంద

**భువనగిరి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి)**

కరీంనగర్‌లో జరిగిన 3వ రాష్ట్ర స్థాయి ఓపెన్-టు-ఆల్ స్టైల్స్ ఇంటర్నేషనల్ కరాటే మరియు కుంగ్-ఫు ఛాంపియన్‌షిప్ - 2025లో మోంటెస్సరి స్కూలు కు చెందిన 4వ తరగతి విద్యార్థి ఎం. డి అయానుద్దీన్ బంగారు పతకాన్ని గెలుచుకున్నాడని అందుకు తాము గర్విస్తున్నామని పాఠశాల ప్రిన్సిపాల్ బీవీ సునంద తెలిపారు.పోటీలు ముగించుకుని వచ్చిన సందర్బంగా విద్యార్థి ని పాఠశాల ఆవరణలో ఆమె అభినందించారు. రానున్న కాలం లో ప్రతీ విద్యార్థి అంకితభావం మరియు కృషితో ప్రకాశిస్తూ మరియు స్ఫూర్తిదాయకంగా ఉండండాలని ఆకాంక్షించారు.






## ఘనంగా కాళోజీ నారాయణరావు 111వ జయంతి వేడుకలు

**దేవరకొండ, సెప్టెంబర్ 09(జనంసాక్షి)**

కాలాన్ని ఆయుధంగా మార్చుకుని తన కవిత్వం, రచనల ద్వారా ప్రజలకు చైతన్యం కల్పించిన మహనీయుడు,ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని ఎం కె ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమావత్ రవి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగ ఆధ్వర్యంలో కాలోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని తెలంగాణ భాషా దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సమసమాజ నిర్మాణానికి కాళోజీ బాటలు వేసారని, ఆయన జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా వచ్చిన డిఎస్ఎస్ ఆర్ కృష్ణ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం ఊపిరిగా జీవించిన ప్రజాకవి, తెలుగు భాష, ప్రజల అవసరాల కోసం కాళోజీ నిరంతరం కృషి చేశారని, తన కవితలు, రచనల ద్వారా ప్రజల్లో స్ఫూర్తి నింపారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి. కోటయ్య అకాడమిక్ కోఆర్డినేటర్ సి.లింగమయ్య, సి ఓ ఈ జి.లింగారెడ్డి, తెలుగు అధ్యాపకులు ఏ.శ్రీను తదితర అధ్యాపకులు విద్యార్థుల విద్యార్థులు పాల్గొన్నారు.

# న్యాయవాదుల రక్షణ చట్టాన్ని రూపొందించి వెంటనే అమలు చేయాలి

**హుజూర్ నగర్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):** న్యాయవాదుల రక్షణ కొరకు న్యాయవాదుల రక్షణ చట్టాన్ని రూపొందించి వెంటనే అమలు చేయాలని పలువురు న్యాయవాదులు డిమాండ్ చేశారు. జీడిమెట్ల కు చెందిన న్యాయవాది బండారు సురేష్ బాబు పై కొందరు దుండగులు దాడి చేసి గాయపరిచిన సంఘటనను తీవ్రంగా ఖండిస్తూ అందుకు నిరసనగా హుజూర్ నగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం తమ విధులను బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే రూపొందించి అమలు పరచనట్లయితే దేశవ్యాప్తంగా న్యాయవాదులు ఉద్యమించి ప్రభుత్వాలను స్తంభింప చేస్తామని హెచ్చరించారు. వృత్తి ధర్మంలో భాగంగా తమ వద్దకు వచ్చిన కక్షిదారుల తరఫున చట్టపరంగా కేసులను వాదిస్తూ చట్టానికి లోబడి పని చేస్తున్న న్యాయవాదులపై ప్రతివాద కక్షిదారులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని భౌతిక దాడులకు పాల్పడటం, దౌర్జన్యాలు చేయటం, బెదిరించటం న్యాయ వ్యవస్థకే గొడ్డలి పెట్టన్నారు. తమ విధుల బహిష్కరణ కు సహకరించాలని కోరుతూ బార్ అసోసియేషన్ చేసిన తీర్మాన కాపీలను రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి లక్ష్మీ శారద, సీనియర్ సివిల్ జడ్జి రాధాకృష్ణ చౌహన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మారుతీ ప్రసాద్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆయేషా సరీనా లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి చనగాని యాదగిరి, ఉపాధ్యక్షుడు జక్కుల నాగేశ్వరరావు, అధికార ప్రతినిధి కాల్వ శ్రీనివాసరావు, న్యాయవాదులు ధూళిపాల శ్రీనివాసరావు, ఎం ఎస్ రాఘవరావు, ఉప్పల గోపాలకృష్ణమూర్తి, ఉదారి యాదగిరి, పాలేటి శ్రీనివాసరావు, రమణారెడ్డి, రామ లక్ష్మారెడ్డి, సైదా హుస్సేన్, రామినేని వెంకటేష్, చక్రాల వెంకటేశ్వర్లు, బానోతు శ్రీను నాయక్, గుగులోతు వెంకటేష్ నాయక్, రామారావు తదితరులు పాల్గొన్నారు.





## తెలంగాణ ఉద్యమ ప్రతిధ్వని ప్రజాకవి కాళోజి

కనగల్, సెప్టెంబర్ 9 (జనం సాక్షి)

తెలంగాణ ఉద్యమ ప్రతిధ్వని, రాజకీయ, సామాజిక చైతన్యల సమహారం, నిజాం అరాచకాలకు వ్యతిరేకంగా కలమెత్తిన ప్రజాకవి కాళోజీ నారాయణ రావు అని తహసిల్దార్ పద్మ అన్నారు. మంగళవారం తహసిల్దార్, ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ పద్మ మాట్లాడుతూ కాళోజి నిజాం నిరంకుశ పాలనను తన కవిత్యాల ద్వారా ప్రజలను ఎంతో చైతన్యపరచాడని, ఆయన వ్రాసిన కవిత్వాలు కనుమరుగు కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తు చేశారు. జయంతి కార్యక్రమంలో ఎంపీడీవో కే సుమలత, డిప్యూటీ తహసిల్దార్ ఎన్ పార్వతమ్మ, ఆర్. ఐ. లు సునిత, ఎం యాదగిరి, సీనియర్ వై విగ్నేశ్వర్ రెడ్డి, రాములు ఇంచార్జ్ ఎంపీఓ వీరబాబు, ఏపీ ఓ బి సుధాకర్, జూనియర్ అసిస్టెంట్లు టి పద్మ, సరిత, రాయల గోవర్ధనాభాయ్, లతీఫ్, టైపిస్ట్ వెంకటరమణ, టి ఏ ఎం రమేష్, కంప్యూటర్ ఆపరేటర్లు గాలెంక రాజు, కందుల వెంకట్, సైదులు

# ఘనంగా ప్రజాకవి కాళోజి జయంతి వేడుకలు






**బోనకల్, సెప్టెంబర్ 09 (జనంసాక్షి):** బోనకల్ మండల వ్యాప్తంగా పలు గ్రామపంచాయతీల లో ప్రభుత్వ పాఠశాలలో, కాలేజీలు ,ప్రభుత్వ కార్యాలయాలలో కాళోజి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బోనకల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ కార్యదర్శి కోలా రాజేశ్వరి ,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి దుర్గారావు, గ్రామపంచాయతీ సిబ్బంది ,అంగన్వాడీలు , పలువురు గ్రామ ప్రజలు తదితరులు జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో ఇంచార్జ్ ప్రిన్సిపల్ జోనాతాన్ బాబు అధ్యక్షతన ఘనంగా కాళోజీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాలలతో సత్కరించడం జరిగింది. ఎన్ ఎస్ ఎస్ పి ఓ , చరిత్ర అధ్యాపకులు అంతోటి తిరుపతిరావు మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు 1914 సెప్టెంబర్ 9 తేదీన కర్ణాటక రాష్ట్రంలో ని బీజాపూర్ జిల్లాలోని రట్టా హళ్లి గ్రామంలో తండ్రి రంగారావు , తల్లి రమాబాయమ్మ కు జన్మించినారు. తన విద్యాభ్యాసం వరంగల్ జిల్లాలో మడికొండలో ప్రాథమిక విద్య ను వరంగల్ , హైదరాబాద్ లో ఉన్నత విద్య పూర్తి చేసినారు. బహుభాషా వేత్త గా, తెలుగు, మరాఠా, కన్నడం,హిందీ , ఉర్దూ భాష లలో కవిత్వం రాశారు. ఆర్య సమాజ ఉద్యమంలో, వందేమాతర ఉద్యమంలో ,గ్రంథాలయ ఉద్యమంలో , నిజాముకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య ఉద్యమం లో 1939 ,1943 సంవత్సరంలో జైలు శిక్ష కూడా అనుభవించాడు. "నా గొడవ " అనే ప్రసిద్ధ ప్రజాకవి కాళోజీ నారాయణరావు రచించిన కవితలు అన్యాయాన్ని, అసమానతలను ఎదిరిస్తూ ప్రజల ఆర్తిని, ఆక్రందనలను ప్రతిధ్వనిస్తూ మానవతా విలువలను బోధిస్తాయి. ఈ కవితలు సామాజిక చైతన్యానికి ప్రతిధ్వనిగా నిలిచాయి. 1992 భారత ప్రభుత్వం పద్మ విభూషణ్ పురస్కారం అందించింది. కాకతీయ విశ్వవిద్యాలయం డాక్టర్ ను అందించింది. ఒక్క సిరా చుక్క లక్ష మెదడులకు కదలిక అంటూ ఆలోచన జ్యోతులను వెలిగించిన కాళోజి 2002 నవంబర్ 13న కీర్తిశేషులు అయ్యారు. తన భౌతిక శరీరాన్ని వైద్య పరిశోధనకు ఇచ్చారు. ప్రజా కాంక్షలు లను ఎలిగెత్తి చాటిన అస్స లులైన ఉద్యమ కారు ప్రజా వైతాళికుడు కాలజీ నారాయణరావు అని కొనియాడారు. కాళోజీ నారాయణరావు జయంతిని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవం గా నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు , అధ్యాపకేతర సిబ్బంది ఎ.రాజేంద్ర కుమార్,పి. లక్ష్మీకాంతం, యు.రామ కృష్ణ , యం.రమేష్ , యస్. రాజేంద్ర, జి.ప్రియ కుమార్ రెడ్డి, ఏ యూఎం కృష్ణ ,లైబ్రేరియన్ ఎ.మోహన్ , యు డి సీ మదర్, జస్వంత్ బుజ్జమ్మ ,అరుణ, యశోద , విద్యార్థులు పాల్గొన్నారు.



**కామేపల్లి మండల పరిధి లోని గోవింద్రాల గ్రామ గిరిజన నివాసి అయిన సామాజిక కార్యకర్త,రిక్నైజ్ ఉపాధ్యాయ పండిట్ పరిషత్ జిల్లా కార్యదర్శి లావుడియా రవి కుమార్ చౌహాన్ ఈ సందర్భంగా విలేకరులతో ఆయన తెలిపారు మంగళవారంమాటూర్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ప్రజా కవి శ్రీ కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.**





## ఘనంగా కాళోజి జయంతి

**మధిర ,సెప్టెంబర్ 9 (జనంసాక్షి):** తెలంగాణ తెలుగు భాషా దినోత్సవం (శ్రీ కాళోజీ జన్మ దినం) పురస్కరించుకొని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల – మర్లపాడు నందు కాళోజీ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పి భీమరాజు కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి, ప్రసంగిస్తూ కాళోజీ కేవలం కవిత్వానికి, తెలుగు భాషకు మాత్రమే సేవ చేయలేదని హైదరాబాద్ రాష్ట్రంలోని ప్రజల స్వాతంత్ర కాంక్షను తట్టి లేపి, బానిస బ్రతుకులకు, వెట్టి చాకిరికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచిన స్ఫూర్తి ప్రధాతయని కొని యాడారు. అదేవిధంగా తెలుగు ఉపాధ్యా యులు బంగారు వివిధ తెలుగు పాఠ్యపుస్తకాలలో గల పాఠాలను ఉటంకిస్తూ మాండలిక భాష, ప్రాంతీయ భాష గా తెలుగు యొక్క గొప్పదనం వంటి అనేక అంశాలను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోటారెడ్డి మాట్లాడుతూ కాళోజీ జీవితం వడ్డించిన విస్తరి కాదని, అనేక నిర్బంధాలకు, ఇబ్బందులకు గురై తన సేవలు ఈ గడ్డకు అందించారని ఘనంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో వీరయ్య ఆలపించిన ఆ చల్లని సముద్ర గర్భం పాట విద్యార్థుల్ని అలరించింది. పాఠశాల ఉపాధ్యాయులు శ్రీ చంద్రశేఖర రావు, రమాదేవి, వీరయ్య, వెంకటేశ్వర స్వామి, రవి, సోనీ గార్లు మరియు సిబ్బంది రామకృష్ణ, నాగూర్ సాహెబ్ పాల్గొన్నారు.



## త్రివేణి లో కాళోజి జయంతి వేడుకలు

**ఖమ్మం, (జనం సాక్షి):** పుట్టుక నీది –చావు నీది బ్రతుకంతా దేశానిది అంటూ తెలంగాణ మాండలికంలో చక్కని కవితలు అల్లిన విశ్వ మానవ కవి కాళోజీ నారాయణరావు ఆయన జయంతిని తెలంగాణ మాండలిక భాషా దినోత్సవం గా ప్రతి సంవత్సరం జరుపుకుంటాం. ఈ సందర్భంగా ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి పాల్గొని కాళోజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. స్థానిక తెలుగు సొగసును మాతృభాషలోనే తీయదనాన్ని ప్రతి ఒక్కరు ఆనందించాలని ప్రపంచంలో ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషకున్న ప్రత్యేకత తరగదని అన్నారు. అనంతరం పాఠశాల స్థాయిలో జరిగిన వ్యాస రూప, వక్తృత్వ మరియు కవితల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు.పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పరభాష జ్ఞానాన్ని సంపాదించి ఏ ప్రాంతంలోనైనా బ్రతకగలిగేలా మనం ఎదిగినప్పటికీ మాతృభాష యొక్క మూలాలను మరవరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు త్రివేణి పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న ముస్తఫా క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్ సందీప్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సమాజంలోని సామాన్య ప్రజలు సమస్యలను ఎదుర్కొని ధైర్యంగా జీవించడానికి ప్రేరణ కల్పించిన మహోన్నత వ్యక్తి కాళోజి

### ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు

**కోదాడ, సెప్టెంబర్ 9( జనంసాక్షి):** కోదాడలోని కె.ఆర్.ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్ విభాగం(జాతీయ సేవా పథకం) ఆధ్వర్యంలో పద్మ విభూషణ్, ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకొని "తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు" నిర్వహించడం జరిగింది. ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం అధికారి, తెలుగు ఉపన్యాసకులు వేముల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నారు రమణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని కాళోజీ చిత్రపటానికి పూలమాల సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. తదనంతరం ఆయన మాట్లాడుతూ...సమాజంలోని సామాన్య ప్రజలు సమస్యలను ఎదుర్కొని ధైర్యంగా జీవించడానికి ప్రేరణ కల్పించిన మహోన్నత వ్యక్తి కాళోజీ అని, ప్రాంతేతరుడు దోపిడీ చేస్తే పొలిమేర దాకా తన్ని తరుముతామని, ప్రాంతం వాడే దోపిడీ చేస్తే ప్రాణంతోనే పాతరేస్తామని, దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. తెలంగాణ కష్టాలను కవిత్వం గా మార్చి, సరళమైన భాషకు పట్టం కట్టి, తన అక్షరాలతో సామాన్యులకు పట్టం కట్టినవాడు కాళోజీ అన్నారు. తెలుగు భాష మాట్లాడడానికి వెనకాడుచున్నటువంటి వాళ్లకు గట్టి చురకలు వేశాడు. ఆయన కవిత్వమంతా సమాజ గొడవగా, సామాన్యుని గొడవగా కొనసాగిందనీ,పేదల సమానత్వం కోసం ,న్యాయం కోసం నిరంతరం పోరాటం చేశారని, బడి పలుకుల భాష వద్దని, పలుకుబడుల భాష కావాలని వ్యవహారికంలోనే రచన చేశారని అన్నారు. అక్షరం మనిషిని బానిసత్వం వైపు కాకుండా విముక్తి వైపు తీసుకెళ్ళాలని రమణారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది ఆర్.పిచ్చి రెడ్డి, జి.యాదగిరి, వి. బల భీమారావు, ఆర్. రమేష్,పి.రాజేష్, ఎం. రత్నకుమారి, జి .వెంకన్న, కె. రామరాజు, జి. రవి కిరణ్, కే .సతీష్, జి. నాగరాజు, పి. తిరుమల, ఈ.నరసింహారెడ్డి, ఎస్.గోపికృష్ణ, ఎస్.కె. ముస్తఫా, ఎస్. కే. ఆరిఫ్, ఎన్. జ్యోతిలక్ష్మి, ఆర్. చంద్రశేఖర్, ఎస్.వెంకటేశ్వర చారి, టి.మమత, డి .ఎస్. రావులతో పాటుగా విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## జిల్లా గ్రంధాలయంలో కాళోజి నారాయణరావు జయంతి

**భువనగిరి, సెప్టెంబర్9(జనం సాక్షి)** భువనగిరి జిల్లా కేంద్ర గ్రంధాలయం లో కాళోజీ నారాయణ రావు జయంతి కార్యక్రమము నిర్వహించడం జరిగింది.ఎమర్జెన్సీ కాలం నుండి తెలంగాణ ఉద్యమంలో కాళోజీ తన రచనల ద్వారా ఉద్యమ స్ఫూర్తి కలిగించిన వ్యక్తి ప్రజా కవి కాళోజీ నారాయణరావు . ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సిబ్బంది, పాఠకులకు పాల్గొన్నారు.



## వడాయి గూడెం గ్రామంలో ఫీవర్ సర్వే క్యాంపు






భువనగిరి రూరల్ , సెప్టెంబర్ 9(జనంసాక్షి) బొల్లెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వడాయిగూడెం గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే చేసి ఫీవర్ క్యాంప్ నిర్వహించడం జరిగింది. ఇందులో 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా ఇందులో 25 మందికి ఆర్ టి డి కిట్స్(మలేరియా, డెంగ్యూ) ద్వారా పరీక్షలు నిర్వహించగా అన్ని నెగటివ్ రిజల్ట్ వచ్చాయి, కాగా ఇందులో 10 మందికి సాధారణ జ్వరాలు ఉండగా వారందరికీ ఉచిత మందులు పంపిణీ చేయడం జరిగింది. గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి పారిశుధ్య ఈ సందర్భంగా మండల వైద్యాధికారి యామిని మాట్లాడుతూ ప్రజలందరు వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత గురించి హెల్త్ ఎడ్యుకేషన్ ఇవ్వడం జరిగింది. అనంతరం దోమలు రాకుండా పిచ్చికారి చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి డాక్టర్ మురళీమోహన్, సి హెచ్ ఓ రమాదేవి, రేణుక, పూవనేశ్వరి,ఉమాదేవి ,గ్రామ కార్యదర్శి ఆమని మరియు ఆశలు పాల్గొన్నారు.

## లచ్చగూడెం గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం




టేకులపల్లి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం లచ్చగూడెం గ్రామంలో టేకులపల్లి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రీజనల్ మేనేజర్ ఎం.సత్య నారాయణ డిజిఎం గన్యామ్ సోలంకి పాల్గొని మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన, ప్రధానమంత్రి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ఇన్సూరెన్సుల వలన యాక్సి డెంట్లు కానీ సాధారణ మరణాలు సంభవించి నప్పుడు కుటుంబానికి ఆసరా అవుతాయి, అకౌంట్ లేనివారికి ఉచిత ఎకౌంట్లు తీయబడుతాయని, సైబర్ నేరాలపై అవగాహన ఓటిపి కానీ ఇతర వివరాలు కానీ అపరిచిత వ్యక్తులకు తెలియ పరచకూడదు అని అన్నారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి బ్యాంక్ మేనేజర్ ముఖేష్ కుమార్, ఎల్ డి ఎం రామిరెడ్డి, బ్యాంకు ఎఫ్ ఐ మేనేజర్ భాను పద్మశ్రీ, ముఖేష్ కుమార్ పే పాయింట్ మేనేజర్ బి కిషోర్,ఎఫ్ ఓ ఎస్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు చలో ఐటిడి కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

### మొవ్వ వెంకటేశ్వరరావు (లడ్డ)

బూర్గంపహాడ్ సెప్టెంబర్ 09 (జనంసాక్షి) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- మౌలిక వసతుల కల్పనకు చలో ఐటిడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సి పి ఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మొవ్వా వెంకటేశ్వరావు (లడ్డ) అన్నారు. బూర్గంపహాడ్ మండలం సారపాక సిపిఐ కార్యాలయంలో సిపిఐ అత్యవసర సమావేశం పేరాల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా కార్యవర్గ సభ్యులు మొవ్వ వెంకటేశ్వరావు (లడ్డ) హాజరై ఆయన మాట్లాడుతూ ఈనెల 12వ తారీకు చలో ఐటిడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, గిరిజన గ్రామాలకు మౌలిక వసతులు కల్పించి, పోడు భూములకు పట్టాలి ఇవ్వాలని, పోడు సాగు అమాయక గిరిజనులపై ఫారెస్ట్ అధికారుల దాడులు ఆపాలని, చిన్న పిల్లలకు అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలనే సమస్యల మీద సారపాక నుండి ఐటీడీ కార్యాలయం వరకు చేస్తున్న పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు. ముఖ్యంగా పోడు భూములు సర్వే చేసి ఇంతవరకు వారికి ఎటువంటి ఆధారాలు ఇవ్వలేదని, రోడ్లు, మంచినీళ్లు, కరెంటు లేక చీకటిలోనే వీరు జీవనం సాగిస్తున్నారని, కనీసం చదువుతున్న పిల్లలకు కూడా కుల, ఆదాయ సర్టిఫికెట్లు జారీ చేయట్లేదని, అందుకు నిరసనగా 12 వ తారీకు న. తలపెట్టిన చలో ఐటీడీఏ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి బాలకృష్ణ, సోడే చంద్రయ్య, పొడియం సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.




## నానో యూరియాతో అనేక లాభాలు




హాలియా, సెప్టెంబర్ 9 జనంసాక్షి : నానో యూరియా.. నానోటెక్నాలజీ సహాయంతో తయారు చేయబడినదని దీనితో అనేక లాభాలు ఉన్నాయని సహాయ వ్యవసాయ సంచాలకులు ఏం సరిత, మండల వ్యవసాయ అధికారి ముని కృష్ణలు అన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళ వారం నానో యూరియా గురించి అవగాహన కల్పించారు. నానో యూరియా అనేది నానోటెక్నాలజీ సహాయంతో తయారు చేయబడిన ద్రవ రూపంలో ఉండే నత్రజని ఎరువు అని దీని వాడకం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయను.. నానో యూరియా మొక్కలకు సమర్థవంతంగా నత్రజనిని అందిస్తుందని తెలిపారు. పంట దిగుబడిని పెంచడంలో సహాయపడుతుందని.. సాంప్రదాయ యూరియా వాయువుగా మారి వాతావరణంలోకి విడుదలై పర్యావరణానికి హాని చేస్తుంది భూగర్భ జల వనరులకు ఇబ్బంది కలగడమే కాకుండా, నేలకు కూడా చాలా నష్టం కలిగిస్తుందని పేర్కొన్నారు.సాంప్రదాయ యూరియాతో పోలిస్తే నానో యూరియా తక్కువ మొత్తంలో వాడడం వలన ఇది మట్టి, నీటి కాలుష్యాన్ని తగ్గిస్తుందని.. నానో యూరియా ద్రవ రూపంలో ఉండటం వల్ల, రవాణా, నిల్వ చేయడం సులభతరం అని.. పంటలకు రసాయన ఎరువులు వేస్తేనే దిగుబడులు వస్తాయన్న ఆలోచనలో రైతులు ఉన్నారని.. పంట ఆరోగ్యం, నాణ్యమైన ఉత్పత్తికి పచ్చిరొట్ట, సేంద్రియ, జీవన ఎరువులు ఎలా ఉపయోగపడతాయో నానో యూరియా కూడా అంతే ఉపయోగపడుతుందని తెలిపారు. వరి పంటకు నాటు వేసిన 20 నుండి 25 రోజుల తర్వాత ఒకసారి ఎకరాకు 500 ఎం ఎల్ నానో యూరియా పిచికారి చేసుకోవాలి అలాగే 45 నుండి 50 రోజుల తర్వాత ఒకసారి ఎకరాకు 500 ఎం ఎల్ నానో యూరియా పిచికారి చేసుకోవాలి, నానో యూరియా వివిధ మండలాలలోని ఎరువుల దుకాణాలలో అందుబాటులో ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## ఎంపీడీవో కార్యాలయం నందు ఆది కర్మయోగి అభియాన్ సభ్యులకు శిక్షణ కార్యక్రమం



పినపాక, సెప్టెంబర్ 09(జనం సాక్షి): ఆది కర్మయోగి అభియాన్ సభ్యులకు శిక్షణ కార్యక్రమం పినపాక ఎంపీడీఓ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐటీడీఏ కార్యాలయం మేనేజర్ రాంబాబు పాల్గొని మాట్లాడుతూ గిరిజనుల సాంప్రదాయాలు, సాంస్కృతిక విలువలు, వారి ప్రత్యేక అవసరాలను గుర్తించే విధంగా, విజన్ బిల్డింగ్ రూపొందించాలని రాంబాబు సూచించారు. పినపాక మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆది కర్మయోగి అభియాన్ సభ్యులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి వారు మాట్లాడారు గిరిజన నాయకులు కమ్యూనిటీ ప్రతినిధుల భాగస్వామ్యం ద్వారా గిరిజన గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.

## జర్నలిజం వృత్తి కాదు సామాజిక బాధ్యత : తహసిల్దార్ గోపాలకృష్ణ



పినపాక, సెప్టెంబర్ 09 (జనంసాక్షి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలం నందు నూతనంగా ఏర్పడిన పినపాక జర్నలిస్టుల సంఘం మండల అధ్యక్షులు సత్రపల్లి సారయ్య నేతృత్వంలోని ఆ సంఘం ప్రతినిధుల బృందం మండలంలోని వివిధ శాఖల అధికారులను మంగళవారం మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. తొలుత తహశీల్దార్ గొంది గోపాలకృష్ణ ను కలిశారు. అనంతరం ఎంపీడీవో సునీల్ కుమార్, ఎం పి ఓ వెంకటేశ్వర్లు ను కలిశారు. పలు అంశాలపై చర్చించారు. ప్రజల తరఫున సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, వాటి పరిష్కారానికి కృషి చేయడం జర్నలిజం ప్రధాన ధ్యేయమని అధ్యక్షులు సారయ్య తెలిపారు.ప్రజా సమస్యలను పట్టించుకోవడం, వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం మా కర్తవ్యంగా భావిస్తున్నాం. జర్నలిజం సమాజానికి అద్దం మాత్రమే కాదు, అభివృద్ధికి దారితీసే వంతెన కూడా అవుతుందిఅని ఆయన పేర్కొన్నారు. అధికారులు ఈ సందర్భంగా మాట్లాడుతూ.జర్నలిస్టులు సమాజానికి మేలుచేసే శక్తిగా నిలుస్తారని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో, సమస్యలను పరిష్కరించడంలో ముఖ్య పాత్ర పోషిస్తారని అభిప్రాయపడ్డారు. సంఘానికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పినపాక జర్నలిస్టుల సంఘం గౌరవ సలహాదారు, యాగమటి గంగాధర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు కొత్త దామోదర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి అత్తె లక్ష్మణ్, ఉపాధ్యక్షులు, వాగబోయిన సాంబశివరావు, కోశాధికారి కన్నె రమేష్, సభ్యులు గొడిశాల చంద్రం, రాము తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



ఖమ్మం, (జనంసాక్షి): ప్రభుత్వ బాలుర వసతి గృహం (బి) ఖమ్మం నందు మామిళ్లగూడెం మెడికల్ ఆఫీసర్ యన్.కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణ చైతన్య విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలనీ, భోజనం చేసేటప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, అదేవిధంగా చేతి గోళ్లు ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలని, వర్షాకాలంలో చిన్న చిన్న అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది కావున జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. విద్యార్థుల అనారోగ్య సమస్యలు ఉంటే తెలుసుకొని వారికి మందులు పంపిణీ చేశారు. అత్యవసర ప్రాథమిక చికిత్స కి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఎస్.దయామణి, వసతి గృహ సంక్షేమ అధికారి కోటపాటి రుక్మారావు, నాలుగో తరగతి సిబ్బంది పాల్గొన్నారు.

# దమ్మపేటలో ఇసుక మాఫియా

**దమ్మపేట సెప్టెంబర్ 9 (జనంసాక్షి):** దమ్మపేట మండల వ్యాప్తంగా కొందరు ఇసుక మాఫియా వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పేదల కష్టార్జితాన్ని అపహరిస్తున్నారు. దీనికి తోడు ఇద్దరమ్మా ఇల్లు అనే నెపంతో వారి ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. సంబంధిత అధికారుల సైతం నిద్ర అవస్థలో ఉండటంతో ఇసకాసురులు ఆడిందే ఆట పాడిందే పాటగా వారి లాభార్జన మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది. ఈ ఇసుక సురల అన్యాయానికి కొందరు అధికార పార్టీ నాయకులు కొమ్ముకాస్తున్నారని మండల ప్రజల్లో చర్చనీయాశంగా మారింది. పేద ప్రజల సొంతింటి కల అవసరాన్ని వీరు ఆసరాగా చేసుకుని అందిన కాడికి సొమ్ము చేసుకుంటూ పబ్బం గడుపుతున్నారు. పగలు రాత్రి అనే తేడా లేకుండా తమకు నచ్చిన దారుల్లో నచ్చిన వేళల్లో ఆంధ్ర నుంచి తెలంగాణకు ఇసుక సరఫరాను అధిక మొత్తం వెచ్చించి పేద ప్రజల జేబులకు చిల్లులు పెడుతున్నారు. సంబంధిత అధికారులు తూతూ మంత్రంగా దొరికిన వాహనాలను సీజ్ చేసిన వీరి ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. ఇందిరమ్మ ఇళ్ల నెపంతో అందిన కాడికి పిండుకుంటూ ఇసుక మాఫియా కోట్లు కొల్లగొడుతున్నారు. దమ్మపేట మండలానికి సరిహద్దు ప్రాంతం ఆంధ్ర అవటంతో వీరి ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. ఇసుక మాఫియాదారుల ఆగడాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.



## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న స్వరూపారాణి

**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డర్ పెండెం కృష్ణ కుమార్ ఫౌండేషన్ తరపున జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అర్వపల్లి ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న భూపతి స్వరూపారాణి అందుకున్నారు. సూర్యాపేట పట్టణంలోని పద్మశాలి భవన్ లో జరిగిన అవార్డు ప్రధాన కార్యక్రమంలో సెక్టోరియల్ ఆఫీసర్ శ్రవణ్ కుమార్,సూర్యాపేట ఎంఈఓ శేషగాని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని అన్నారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి అవార్డులు అందజేస్తున్న కృష్ణ కుమార్ ఫౌండేషన్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పెండెం కృష్ణ కుమార్,టియుటిఎఫ్ అధ్యక్షులు కిషన్ ప్రసాద్, ఉపాధ్యాయులు భూపతి శ్రీనివాస్ గౌడ్, పులుసు అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ పాలన అధికారులుగా నియామకం

ఆత్మకూరు ఎస్
మండల కేంద్రం లోని తహసిల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న సుధాకర్, జహంగీర్, మల్లయ్యలు గ్రామం పాలనాధికారులుగా నియామకమయ్యారు వీరిని తహసిల్దార్ అమీన్ సింగ్ మంగళవారం శాలువాలతో సన్మానించారు. నిబద్ధత విధులు నిర్వహించి త్వరగా పదోన్నతి పొందాలని ఆకాంక్షిస్తూ వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వీరోచిత తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి

# మతం రంగు పులిమితే చరిత్ర హీనులవుతారు

- తెలంగాణ సాయుధ రహితంగా పోరాటంలో మీ పాత్ర ఎక్కడ బిజెపి సమాధానం చెప్పాలి
- వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను చెరిపేస్తే చెరిగిపోయేది కాదు
- నాలుగు వేల మంది కమ్యూనిస్టు యోధుల బలిదానమే వీర తెలంగాణ పోరాటం
- సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు




**భువనగిరి, సెప్టెంబర్ 9(జనంసాక్షి)**
యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి శ్రీనివాస ఫంక్షన్ హాల్ లో "వీరతెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం" ప్రజా విజయాలు- వాస్తవాలు- వక్రీకరణలు అనే అంశంపై సిపిఎం జిల్లా ప్రజా సదస్సు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి. జహంగీర్ అధ్యక్షతన జరిగింది.

ఇ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవి. రాఘవులు మాట్లాడుతూ వీర తెలంగాణ సాయుధ రైతంగ పోరాటం ప్రపంచంలో ఎన్నో పోరాటాలకు స్ఫూర్తినిచ్చిందన్నారు నాడు తెలంగాణ ప్రాంతంలో దొరలు, జాగిర్దారులు, పటేల్ పట్వారిలు, నైజాం రజాకారు యూనియన్ సైన్యాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి జరిపిన మహోన్నత పోరాటమన్నారు ఈ పోరాటం దోపిడీ, పీడనలను,వెట్టి చాకిరిని నిర్మూలించడమే కాకుండా ప్రజలకు గౌరవాన్ని తెచ్చిపెట్టిందన్నారు. సుమారు 4000 మంది రక్త తర్పణతో లక్షలాధి ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచిపెట్టిందన్నారు. నాడు విసునూరు రామచంద్రారెడ్డి, జన్నారెడ్డి ప్రతాప్ రెడ్డి లాంటి దుర్మార్గులను తరిమికొట్టిన చరిత్ర సాయుధ రైతాంగ పోరాటమన్నారు. ఆ పోరాటానికి నాయకత్వం వహించింది కమ్యూనిస్టులు మాత్రమేనని పోరాట చరిత్రను గుర్తు చేశారు. కమ్యూనిస్టుల నాయకత్వాన 3000 గ్రామాల్లో గ్రామ స్వరాజ్యాలు సాధించిపెట్టిందనారు. ఈ పోరాటం ప్రజాస్వామ్యాన్ని కాపాడింద న్నారు, భూ పంపిణీ ద్వారా లక్షలాది మంది పేదలకు భూమిని సాధించి పెట్టిందన్నారు, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడే ధైర్యాన్ని అందించిందన్నారు 1946 లోనే మహిళలకు సమాన అవకాశాలు ఇచ్చి మహిళల్ని కథనరంగంలో కార్యోన్ముఖులను చేసి వారిని నాయకత్వ స్థానంలోకి తీసుకువచ్చిందన్నారు. మల్లు స్వరాజ్యం,ఆరుట్ల కమలాదేవి లాంటి వీరనారులను తయారు చేసిందన్నారు. పేదలకు, ముఖ్యంగా మహిళలకు విద్యను అందించే విషయంలో ఆంధ్ర మహాసభ నాయకత్వంలో వయోజన విద్యాను ప్రారంభించి లక్షలాది గ్రామాల్లో చదువు చెప్పిందన్నారు. ఈ పోరాటం ద్వారా అనేకమంది కవులు కళాకారులు ముందుకు వచ్చారని బండి యాదగిరి,సుద్దాల హనుమంతు,సి నారాయణరెడ్డి,కాలోజి నారాయణరావు లాంటివారు అనేకమంది సాయుధ రైతాంగ పోరాటంలో ప్రజలను చైతన్యం చేశారని గుర్తు చేశారు.

ఘనమైన చరిత్ర కలిగిన వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని హిందూ ముస్లింలు గొడవగా వక్రీకరణ చేయాలని భావిస్తున్న బిజెపి, ఆర్ఎస్ఎస్ లకు ఈ పోరాటంతో ఎలాంటి సంబంధం లేదన్నారు
వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి మతం రంగు పులిమితే చరిత్ర హీనులవుతారని అన్నారు 4000 మంది కమ్యూనిస్టు యోధుల బలిదానమే వీరోచిత సాయిధర రైతాంగ పోరాటమని గుర్తు చేశారు నాడు బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా దేశ ప్రజలు పోరాడుతున్న సమయంలో బ్రిటిష్ వారివంతన చేరిన గాడ్సే సావర్కర్ల వారసులు బిజెపి ఆర్ఎస్ఎస్ సంగుపరివారశక్తులు అన్నారు ప్రపంచ చరిత్రలో వీరోచిత స్థానం కలిగిన వీర తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను ఎవరో చెరిపేస్తే చెరిగిపోయేది కాదని ఆ చరిత్రను ముందుకు తీసుకెల్లే అనేకమంది నాటి పోరాట వారసులు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు ఉన్నారన్నారు ప్రజలు ఉన్నంతవరకు ఈ చరిత్ర ఉంటుందని ఈ పోరాట చరిత్రను గ్రామ గ్రామాన నేటి తరానికి అందించాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై వారి వారసులపై ఉందన్నారు.

ఈ సందర్భంగా మాజీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో ఉన్న పల్లె,పల్లెకు, చెట్టుకు, పుట్టకు ఒక చరిత్ర ఉందని ముఖ్యంగా కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలకు తాతల, తండ్రుల వారసత్వం కలిగి ఉందని చరిత్రను వక్రీకరించాలని చూస్తున్న బిజెపికి ఏముందో చూపెట్టగలరా అని ప్రశ్నించారు.

సాయుధ పోరాట చరిత్ర స్ఫూర్తితో నాడు జాగీర్దారులు,పటేల్,పట్వారిలకు, రజాకార్ మూకలకు వ్యతిరేకంగా పోరాడినట్లే నేడు దేశాన్ని పట్టిపీడిస్తున్న మతోన్మాదంపై పోరాడాలని మత చిచ్చు రేపి తమ పబ్బము గడుపుకోవాలని చూస్తున్న మతోన్మాదముకలకు వ్యతిరేకంగా పోరాడినప్పుడే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరుల వారమవుతామని, మతోన్మాదంపై పోరాడాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం,దాసరి పాండు, గుంటోజు శ్రీనివాసచారి,
సీనియర్ నాయకులు గూడూరు అంజిరెడ్డి, పైళ్ల యాదిరెడ్డి,గద్దె నర్సింహా
జిల్లా కమిటీ సభ్యులు సిర్పంగి స్వామి, బోలగాని జయ రాములు. దయ్యాల నరసింహ, మాయ కృష్ణ, బొల్లు యాదగిరి, ఎండి పాషా, బొడ్డుపల్లి వెంకటేశం,గుండు వెంకట నర్సు, గంగదేవి సైదులు,దోడ యాదిరెడ్డి,మద్దేపురం రాజు, అవ్వారు రామేశ్వరి,రాచకొండా
రాములమ్మ,యంఏ. ఇక్బాల్, ఉపేందర్, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, గడ్డం , రాగిరు కిష్టయ్య, మల్లెపల్లి లలిత, బల్గూరి అంజయ్య, కోట రామచంద్రారెడ్డి, గోశిక కరుణాకర్, పైళ్ల గణపతి రెడ్డి, దూపటి వెంకటేష్,ర్యాకల శ్రీశైలం, పోతరాజు జహంగీర్, వేముల బిక్షం, గాడి శ్రీనివాస్, కొల్లూరు ఆంజనేయులు, బుర్రు అనిల్,నూకల భాస్కర్ రెడ్డి, రామచంద్రం
వివిధ మండల పట్టణ నాయకులుపాల్గొన్నారు.

